తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

శనివారం 8-7-2023

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

teluguprabha.net -TeluguPrabha @TeluguPrabhaofficial

తెలంగాణ యువతకు ఉద్యోగ అవకాశాలు : మోడీ

తెలుగుప్రభ, వరంగల్ (జూలై 8)

తెలంగాణ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరువేల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అలాగే, తెలంగాణలోని నిరుద్యోగ యువతికి ప్రధాని వరాల జల్లు కురిపించారు.

ఇండియన్ రైల్వేలో వ్యాగన్ల కొరత ఉన్నందున వ్యాగన్ తయారీ యూనిట్ కాజీపేటలో ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికిపైగా ఉపాధి లభిస్తుందన్నారు. 2025 వరకు ఈ వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగి యూనిటీ అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. వ్యాగన్ యూనిటీ ప్రారంభమైన మొదటి సంవత్సరం 1200 వ్యాగన్లు, రెండవ సంవత్సరం 2400 వ్యాగన్లు తయారు చేస్తామని అధికారులు అంటున్నారు. మొత్తం గా నెలకి 200 వాగన్ లు ఉత్పత్తి జరుగుతుంది. కాజీపేటలో వ్యాగన్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వస్తే ఇది దేశంలోనే రెండవ అతిపెద్ద యూనిట్ అవుతుంది. మొదటిది పశ్చిమ బెంగాల్లో ఉంది. ప్రస్తుతం ఇండియన్ రైల్వేలో వ్యాగన్ల కొరత ఉన్నందున వ్యాగన్ తయారీ యూనిట్ కాజీపేటలో ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ తయారయ్యే వ్యాగన్ లతో ఇండియన్ రైల్వే లో సరుకు రవాణా మెరుగు పడుతుందన్నారు. .ఓపెన్, క్లోజ్, వాగన్ లతో పాటు అన్ని రకాల సరుకు రవాణా కి ఉపయోగపడే విధంగా వ్యాగన్ లు రెడీ అవుతాయని అధికారులు అంటున్నారు.

బీఆర్ఎస్‌లోకి వివేక్?

అదే జరిగితే బీజేపీకి భారీ షాక్

ఎన్నికలు సమీస్తున్న సమయంలో రాజకీయ పార్టీల్లో వలసలు సాధారణమే. కాంగ్రెస్, బీజేపీల నుంచి బీఆర్ఎస్ లోకి.. బీఆర్ఎస్ నుంచి కొందరు ఇతర పార్టీల్లోకి మారారు. వలసలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు మరో వార్త తీవ్ర చర్చనీయాంశం అవుతోంది. బీజేపీకి చెందిన కీలక నేత బీఆర్ఎస్ లోకి చేరతారని వార్తలు వినిపిస్తున్నాయి. మాజీ ఎంపీ వివేక్ బీజేపీని వీడి త్వరలో గులాబీ తీర్థం ప్రచారం జరుగుతోంది.

తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)

పెద్దపల్లి మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నేత వివేక్ వెంకటస్వామి బీఆర్ఎస్‌లో చేరనున్నారనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. గతంలో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచిన ఆయన.. ఆ తర్వాత కొద్దిరోజులపాటు బీఆర్ఎస్‌లో కొనసాగారు. బీఆర్ఎస్ అధినాయకత్వం మీద అసంతృప్తితో గతంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం బీజేపీ జాతీయ కార్యవర్గంలో ఆయన కీలక నేతగా ఉన్నారు. మీడియా అధిపతిగా, మాజీ ఎంపీగా, వ్యాపారవేత్తగా తెలంగాణలో ఆయనకు ప్రత్యేక పేరు ఉంది. అయితే కర్ణాటక ఎన్నికల తర్వాత తెలంగాణలో బీజేపీ బలహీనపడిపోవడం, పార్టీలోని వర్గ విబేధాలతో నేతలందరూ పక్కచూపులు చూస్తున్నారు. ఇప్పటికే పలువురు నేతలు బీజేపీని వీడి ఇతర పార్టీలలో చేరేందుగా సిద్ధమవుతుండగా.. వివేక్ కూడా కాషాయ పార్టీని వీడనున్నారనే ప్రచారం నడుస్తోంది. బీజేపీలో హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తో వివేక్‌కు అసలు పొసగడం లేదనేది బహిరంగ సత్యమే. పలుమార్లు వివేక్‌పై పరోక్షంగా మీడియా ముందే ఈటల చేసిన వ్యాఖ్యలు పార్టీలో చిచ్చు రేపాయి. ఇటీవల ఈటలకు తెలంగాణ బీజేపీ ఎన్నికల నిర్వాహణ కమిటీ ఛైర్మన్ బాధ్యతలు కట్టబెట్టడంతో వివేక్ అసంతృప్తితో ఉన్నారు.త కొంతకాలంగా వివేక్ బీజేపీతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొద్దిరోజులుగా ఆ పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎక్కడా కనిపించడం లేదు. ఇటీవల ఈటలకు బీజేపీలో కీలక పదవి ఇచ్చిన తర్వాత వివేక్ మరింత అసంతృప్తికి లోనైనట్లు చెబుతున్నారు. దీంతో బీఆర్ఎస్‌తో టచ్‌లోకి వెళ్లాలని, త్వరలోనే కారెక్కడం ఖాయమనే ప్రచారం బలంగా జరుగుతోంది. అయితే, గతంలో కూడా వివేక్ పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. ఆయన మాత్రం నిశ్శబ్దంగా ఉన్నారు. మరి తాజా పరిణామాల నేపథ్యంలో వివేక్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

లేటెస్ట్ న్యూస్

మోడీపై హరీశ్‌రావు ఫైర్

తెలంగాణపై విషం చిమ్మడమే ఆయన పని..

తెలుగుప్రభ, వరంగల్ (జూలై 8)

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వరంగల్ పర్యటనలో చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు ఫైర్ అయ్యారు. అప్పుడు తల్లిని చంపి బిడ్డను బతికించారు అన్నరు.. ఇప్పుడు రాష్ట్ర ఏర్పాటు సక్రమంగా జరగలేదు అంటున్నారు.. తెలంగాణపై ఎప్పుడు విషం చిమ్మడమే మోదీ పని మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. హనుమకొండలో టీ డయాగ్నోస్టిక్, రేడియాలజీ ల్యాబ్‌కు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. మొన్న తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారుల బలిదానాలను కించపరిచారు అని కోపోద్రిక్తులయ్యారు. ప్రత్యేక రాష్ట్రం కోసం వరంగల్ జిల్లాకు చెందిన ఎంతో మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణకు కేంద్రం ఏం ఇచ్చింది? అని ప్రశ్నించారు. వరంగల్‌కు కోచ్ ఫ్యాక్టరీ ఎందుకు ఇవ్వలేదు? దేశవ్యాప్తంగా 157 మెడికల్ కాలేజీ ఇస్తే తెలంగాణకు ఒక్కటి కూడా కేటాయించలేదు. నవోదయ పాఠశాలలు, ఐఐఎం, ఐఐఐటీ, ఒక్కటి ఇవ్వలేదు. అన్నింటా తెలంగాణకు మొండి చేయి చూపారు అని మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

తెలంగాణ అంటే భారతీయ జనతా పార్టీకి కడుపు నిండా విషం ఉంటుందన్నారు. బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లినయి అని పేర్కొన్నారు. నిధులు ఇవ్వకుండా సూటిపోటి మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రం పురోగతిలో ఉంటుంది.. అభివృద్ధి ఆగదు అని హరీశ్‌రావు తేల్చిచెప్పారు. ఎంపీలు దత్తత తీసుకున్న గ్రామాల అభివృద్ధిలో టాప్ 10లో దేశంలో 7 తెలంగాణ గ్రామాలు ఉన్నాయి. వివిధ రంగాల్లో కేంద్రం నుండి అనేక అవార్డులు వచ్చాయి. ఇది మా పని తీరు.. కళ్లకు కనిపిస్తలేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మోదీ ఇంకో మాట అంటారు.. రాష్ట్రాలు, కేంద్రం కలిసి ఉండాలని.. నీతులు బాగానే చెబుతాడు. కానీ చేతల్లో మాత్రం చూపించరు అని విమర్శించారు.

భయం భయంగా..

బెంగాల్‌లో పెరుగుతున్న మృతుల సంఖ్య

చిచ్చు రేపిన పంచాయితీ ఎన్నికలు

తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 8)

బెంగాల్‌లో పంచాయితీ పోరు భగ్గుమంటోంది. విధ్వాంసానికి దారి తీస్తోంది. అధికార, విపక్ష సభ్యులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. పార్టీ శ్రేణుల కొట్లాట తీవ్ర స్థాయికి చేరుతోంది. ఒకరినొకరు కొట్టుకుని చంపుకుంటున్నారు. అక్కడి పరిస్థితులు చూసి ప్రజలు వణికిపోతున్నారు. కర్రలు పట్టుకుని రాజకీయ పార్టీల నేతలు హల్‌చల్ చేస్తున్నారు. దీంతో పోలీసు బలగాలు భారీ స్థాయిలో మొహరించాయి.

పశ్చిమ బెంగాల్‌లో జరుగుతోన్న పంచాయతీ ఎన్నికలు హింసాత్మకంగా మారాయి. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 22 జిల్లా పరిషత్, 9730 పంచాయతీ సమితులు, 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరుగుతన్న నేపథ్యంలో పలు చోట్ట హింసాత్మక సంఘటనలు జరిగాయి. కేంద్ర బలగాల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎన్నికలు జరుగుతోన్నా హింస జరుగుతోంది. శనివారం జరిగిన హింసాత్మక సంఘటనలో మృతుల సంఖ్య కూచ్ బెహార్ ప్రాంతంలో బీజేపీ పోలింగ్ ఏజెంట్‌ని దుండగులు కాల్చి చంపారు. ఇక దాడుల్లో గాయపడ్డ సీపీఎం కార్యకర్త చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మల్దా జిల్లాలో జరిగి బాంబు దాడిలో టీఎంసీ కార్యకర్త ఒకరు మరణించాడు. 24 పార్‌గనాస్ జిల్లాలో అబ్దుల్లా అనే బూత్ ఏజెంట్ హత్యకు గురయ్యాడు. ఈ హత్య వెనకాల టీఎంసీ అభ్యర్థి మున్నా బిబి ఉన్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్ల మీదికొచ్చిన పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మున్నా బిబిని వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. <

అధికార తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, సీపీఎం, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ పార్టీల మధ్య తీవ్ర హింస చెలరేగింది. ఇక పలుచోట్ల పోలింగ్ బూత్‌లను ధ్వంసం చేశారు. బ్యాలెట్ పేపర్లకు నిప్పుపెట్టారు. 24 పార్‌గనాస్‌లో ఉన్న పోలింగ్ బూత్‌కు వెళ్లే సమయంలో గవర్నర్ సీవీ ఆనంద్ బోస్‌ను స్థానికులు అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే నందిగ్రామ్ బ్లాక్‌లో ప్రజలు ఎన్నికలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. పోలింగ్ బూత్‌ల వద్ద కేంద్ర బలగాలను వెనక్కి పంపించేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ హింస ఈరోజుకు సద్దుమణుగుతుందా.. తీవ్ర స్థాయికి చేరుతుందా అనే ఆందోళన కలుగుతోంది.

డీఆర్‌డీఓ సైంటిస్ట్‌కు వలపు వల

తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 8)

భారత రక్షణ, క్షిపణి వ్యవస్థలకు సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టేందుకు పాకిస్థాన్ ఓ డీఆర్‌డీఓ సైంటిస్ట్‌కు వలపు వల వేసింది. అందులో చిక్కుకున్న ఆ సైంటిస్ట్ సున్నితమైన సమాచారాన్ని పాక్ ఇంటెలిజెన్స్‌తో పంచుకున్నట్లు అధికారులు గుర్తించి.. అరెస్ట్ చేశారు. పాకిస్థాన్ వేసిన వలపు వలకు చిక్కిన ఓ డీఆర్‌డీఓ సైంటిస్ట్.. మన దేశానికి చెందిన రహస్య సమాచారాన్ని వారితో పంచుకున్నారు. అయితే మహారాష్ట్ర పోలీసులకు చెందిన యాంటీ టెర్రరిజయం స్క్వాడ – ఏటీఎస్ చేసిన దాడుల్లో ఈ డీఆర్‌డీఓ సైంటిస్ట్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని విచారణ జరపగా.. అసలు విషయం వెల్లడించాడు. దీంతో ఆ శాస్త్రవేత్తపై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిపై ఛార్జిషీట్ సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ సైంటిస్ట్ జ్యుడిషియల్ కస్టడీలో ఉన్నాడు.

వలపు వలలో చిక్కుకున్న ప్రదీప్ కురుల్కర్.. డీఆర్‌డీఓ ల్యాబ్‌లలో ఒకదానికి డైరెక్టర్. ఆయనను మహారాష్ట్ర ఏటీఎస్ అధికారులు అరెస్ట్ చేసి గత వారం కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన అధికారులకు సంచలన విషయాలు వెలుగు చూశాయి. జరా దాస్ గుప్తా అనే పేరుతో ప్రదీప్ కురుల్కర్‌కు వలపు వల వేసినట్లు అధికారులు గుర్తు చేశారు. జరా దాస్ గుప్తా పేరుతో చేస్తూ ఆమె మాయలో పడిపోయిన.. ప్రదీప్.. భారత రక్షణకు సంబంధించి రహస్య సమాచారాన్ని వారికి అందించినట్లు సమచారం. క్లాసిఫైడ్ డిఫెన్స్ ప్రాజెక్టులోని భారత క్షిపణి వ్యవస్థల గురించి పాకిస్థాన్ ఇంటెలిజెన్స్ అధికారులతో చాట్ చేసినట్లు మహారాష్ట్ర ఏటీఎస్ కోర్టుకు సమర్పించిన ఛార్జిషీట్‌లో పేర్కొంది. గూఢచర్యానికి పాల్పడినందుకు అధికార రహస్యాల చట్టం కింద కురుల్కర్‌ను మే 3 వ తేదీన అరెస్ట్ చేశారు. ప్రదీప్ కురుల్కర్, జరా దాస్ గుప్తాతో వాట్సాప్ ద్వారా సంప్రదించినట్లు తెలుస్తోంది. అందులో చాటింగ్, వాయిస్, వీడియో కాల్స్ చేసినట్లు అధికారులు గుర్తుంచారు.

పరిచయం ఇలా..

అయితే ప్రదీప్‌తో పరిచయం చేసుకున్న జరా దాస్ గుప్తా.. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అని బ్రిటన్‌లో నివసిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే ప్రదీప్‌కు దగ్గరై అతడ్ని ఆకర్షించేందుకు అందమైన, అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలను పంపించినట్లు గుర్తించారు. దీంతో వారి ఇద్దరి మధ్య బంధం బలపడిందని తెలిపారు. జరా దాస్ గుప్తాకు లొంగిపోయిన ప్రదీప్ కురుల్కర్.. రహస్య సమాచారాన్ని తన ఫోన్‌లో భద్రపరుచుకుని ఆమెతో పంచుకున్నట్లు గుర్తించారు.

ఆ ప్రాంతాల వైపు వెళ్తున్నారా..

ఆంక్షలున్నాయ్ జాగ్రత్త!

బోనాల ఉత్సవాలు నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. వాహనాలు బారులు తీరకుండా 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించారు.

తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)

సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల సందర్భంగా నేటి నుంచి ఈ నెల 10వ తేదీ వరకు హైదరాబాద్ పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కర్బలా మైదాన్, రాణిగంజ్, రాంగోపాల్ పేట్ ఓల్డ్ పీఎస్, ప్యారడైజ్, సీటీఓ, ప్లాజా, ఎస్‌బీఐ క్రాస్ రోడ్ YMCA, సెయింట్ జాన్స్ రోటరీ, సంగీత్ క్రాస్ రోడ్ ప్యాట్నీ క్రాస్ రోడ్ పార్క్ లైన్, బాటా, ఘన్మండి క్రాస్ రోడ్ రసూల్ పూరా రోడ్లు, జంక్షన్ల వైపు వాహనదారులు రావొద్దని సూచించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకునేవారు ముందుగానే బయలుదేరడం మంచిదని సూచించారు.

ఇక టబాకో బజార్, హిట్ స్ట్రీట్ నుంచి మహంకాళి ఆలయం వైపు వెళ్లే రహదారుల్లో వాహనాల రాకపోకలను నిలివేయనున్నారు. ఇక బాటా క్రాస్ రోడ్డు నుంచి పాత రాంగోపాల్ పేట పీఎస్, సికింద్రాబాద్ వరకు సుభాష్ రోడ్డులో వాహనాలు వెళ్లకుండా మూసివేయనున్నారు. అలాగే కర్బలా మైదాన్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చే సాధారణ ట్రాఫిక్, ఆర్టీసీ బస్సులను రాణిగంజ్ క్రాస్ రోడ్ వద్ద మినిస్టర్ రోడ్‌రసూల్‌పురా క్రాస్ రోడ్‌PNT ఫ్లై ఓవర్–సీటీవో–ఎస్‌బీఐ క్రాస్ రోడ్డు–YMCA క్రాస్ రోడ్డు–సెంట్ జాన్స్ రోటరీ–సంగీత్–గోపాలపురం లేన్ వైపు మళ్లించనున్నారు.

రైల్వే స్టేషన్ నుండి ట్యాంక్ బ్‌ండ వైపు తిరిగి వచ్చే ఆర్టీసీ బస్సులను చిలకలగూడ ఎక్స్ రోడ్ గాంధీ హాస్పిటల్–ముషీరాబాద్ ఎక్స్ రోడ్ కవాడిగూడ–మారియట్ హోటల్–ట్యాంక్‌బ్‌ండ మీదుగా మళ్లించనున్నారు. అలాగే రైల్వే స్టేషన్ నుంచి తాడ్బన్, బేగంపేట వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులను క్లాక్ టవర్, ప్యాట్నీ క్రాస్ రోడ్డు, ఎస్‌బీఐ క్రాస్ రోడ్డు వైపు మళ్లింపు చేపట్టనున్నారు. అటు బైబిల్ హౌస్ నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, త్రిముల్గేరి వైపు వచ్చే వాహనదారులను ఘన్మండి క్రాస్ రోడ్ వద్ద సజ్జన్ లాల్ స్ట్రీట్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, హిట్ స్ట్రీట్, రాణిగంజ్ వైపు మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

అటు ఎస్‌బీఐ క్రాస్ రోడ్స్ నుండి ట్యాంక్ బ్‌ండ వైపు వచ్చే వాహనాలను ప్యాట్నీ క్రాస్ రోడ్ వద్ద ప్యారడైజ్, మినిస్టర్ రోడ్ క్లాక్ టవర్, సంగీత్ క్రాస్ రోడ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, చిల్‌కలగూడ, ముషీరాబాద్ క్రాస్ రోడ్ కవాడిగూడ, మ్యారియట్ హోటల్, ట్యాంక్‌బ్‌ండ వైపు మళ్లించనున్నట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు ప్రజలు సహకరించాలని, ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

వరినాట్లు వేసిన రాహుల్ గాంధీ

తెలుగుప్రభ, న్యూఢిల్లీ (జూలై 8)

కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీ తన పర్యటనను కొనసాగిస్తున్నారు. ఏదో విధంగా నిత్యం ప్రజల్లో ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు తాజాగా కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ సిమ్లా పర్యటనకు బయలుదేరారు. దారిలో సోనిపట్ వద్ద కూడా ఆగి పొలాల్లో పని చేస్తున్న రైతుల మధ్యకి అకస్మాత్తుగా చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతులు, కూలీలతో మాట్లాడి వారి ఆలోచనలను తెలుసుకున్నారు. సోనిపట్‌లోని బరోడా నియోజకవర్గంలోని పలు గ్రామాల పొలాల్లో పని చేస్తున్న రైతులతో రాహుల్ గాంధీ మాట్లాడారు. ఈ సందర్భంగా రాహుల్ రైతులతో కలిసి వరి నాట్లు కూడా వేశారు. రాహుల్ గాంధీ రైతులతో కలిసి మదీనా, బరోజాలో వరి నాట్లు వేశారు. ఈ సమయంలో రాహుల్ గాంధీ కూడా ట్రాక్టర్ నడుపుతూ కనిపించారు. వాస్తవానికి రాహుల్ గాంధీ చేసిన భారత్ జోడో యాత్ర ద్వారా ఇమేజ్‌ను కొనసాగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కర్నాటక ఎన్నికల్లోనూ ఈ యాత్ర ప్రభావం కనిపించింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డెలివరీ బాయ్స్ నుంచి బస్సుల్లో ప్రయాణించే మహిళల వరకు చాలా మందిని కలిశారు. ఇప్పుడు సోనిపట్‌లో కూడా పొలాల్లో పని చేస్తున్న రైతుల మధ్యకు చేరుకుని వారితో మాట్లాడారు.

ఇరువైపులా బాహుబలి కంచె

జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు

తెలుగుప్రభ, హైదరాబాద్ (జూలై 8)

జాతీయ రహదారులపైకి అకస్మాత్తుగా వస్తున్న పశువుల వలన ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రమాదాల నివారణపై కేంద్రం దృష్టి సారించింది. పశువులు రోడ్లు ఎక్కకుండా అవసరమైన చోట జాతీయ రహదారులకు ఇరువైపులా బాహుబలి కంచె ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సాధారణంగా రహదారులపైకి పశువులు రావడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో రోడ్డుకి ఇరువైపుల సరైన కంచెలు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఇలాంటి దుస్థితి ఎదురవుతుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి ప్రమాదాలు అరికట్టేందుకు కేంద్ర రహదారి, రవాణాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ హైవేలలో ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను అడ్డుకునేందుకు రోడ్లకు రెండువైపులా వెదురుతో కూడిన బాహుబలి కంచెను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు.

టీడీపీలో మాజీ ఎస్పీజీ కమాండెంట్ చేరిక

తెలుగుప్రభ, అమరావతి (జూలై 8)

చిత్తూరు జిల్లాకు చెందిన పోలీసు అధికారి, ఎస్పీజీ కమాండెంట్‌గా పనిచేసిన పీసీ స్వామి తెలుగుదేశం పార్టీలో చేరారు. అధినేత నారా చంద్రబాబు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చంద్రబాబు ఆయనకు పసుపు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పీసీ స్వామితో పాటు విశ్రాంత రోడ్లు భవనాలు ఇంజనీర్ జీవి కృష్ణయ్య కూడా తెలుగుదేశం పార్టీ లో చేరారు. చంద్రబాబు విజన్, ఆయన పాలనను అభిమానించే టీడీపీలో చేరానన్నారు. టీడీపీ విధానాలు.. చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నచ్చాయన్నారు. చంద్రబాబు ఏ బాధ్యతలు ఇచ్చినా పార్టీకి సేవలందిస్తారని తెలియజేశారు స్వామి. మాదిగలకు రాజకీయాల్లో సముచిత స్థానం లేదని.. ఆ కులానికి చెందిన తనను చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి ఏదో ఒక అసెంబ్లీ లేదా పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని చిన్నస్వామి కోరినట్లు తెలుస్తోంది.